## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



పెద్దశంకరంపేట, జూన్6: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు పెద్ద శంకరంపేటలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. మండలంలోని టెంకటి గ్రామానికి చెందిన గడ్డం సాయమ్మకు దవాఖాన ఖర్చులకు రూ.16 వేలు, మాడ్చెట్‌పల్లికి చెందిన శైలజకు రూ.39 వేలు, భూర్గుపల్లికి చెందిన సాయిలుకు రూ.14,500 చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, నాయకులు సురేశ్‌గౌడ్, సుభాశ్‌గౌడ్, దత్తు, అశోక్, మాణిక్‌రెడ్డి, తదితరులు అభినందిచచారు.

## బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల సాయం



బాధత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రామాయంపేట, జూన్ 6: అనారోగ్యంతో మృత్యువాత పడ్డ బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్ గ్రామానికి చెందిన నర్సగల్ల దిలీప్ కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తలతో రూ.5వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఆర్థిక సాయం అందించిన వారిలో గ్రామానికి చెందిన బానప్పగారి నర్సారెడ్డి, స్వామి, బాబు, తుడుం శ్రీనివాస్, బాబు, రవి, సిద్దిరాములు, మహేశ్, జీవన్ తదితరులు ఉన్నారు.

## జీతాలిస్తేనే పనులు చేస్తామని కార్మికుల నిరసన



జీతాలివ్వాలని నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

రామాయంపేట, జూన్ 6: ప్రభుత్వం రెండు నెలల జీతాలు, పీఎఫ్ డబ్బులు ఇస్తేనే పనుల్లో చేరుతామని మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు శుక్రవారం నిరసన చేపట్టారు. జీతాలిస్తేనే తమ కుటుంబాలు గడుస్తాయని లేకుంటే పస్తులుండాల్సి వస్తుందని పేర్కొన్నారు. కమిషనర్‌ను ఎన్నిసార్లు అడిగినా తప్పించుకుంటున్నాడన్నారు. కనీసం దవాఖానలో పరీక్షలు చేయించుకుందామన్నా చేతిలో డబ్బులేవని తెలిపారు. కార్మికులు పనులకు వెళ్లకపోవడంతో రామాయంపేటలోని ఎక్కడి చెత్త అక్కడే ఉంది.

## మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి



సమావేశానికి హాజరైన మహిళా సంఘాల సభ్యులు

నర్సాపూర్, జూన్ 6: గ్రామీణ ప్రాంతాల స్వయం సహాయక బృందాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో అలీప్‌ను (అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ ప్రీనియర్ ఆఫ్ ఇండియా) ఏర్పాటు చేసినట్లు అధ్యక్షురాలు రమాదేవి తెలిపారు. ప్రపంచ బ్యాంకు నిధులతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ర్యాంప్ (రైజింగ్ అండ్ యక్సలేరేటింగ్ ఎంఎస్ఎంఇ పెర్ఫార్మెన్స్)లో భాగంగా ప్రభుత్వ పరిశ్రమల శాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థతో సంయుక్తంగా గ్రామీణ ప్రాంతాల్లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సరస్వతి మాట్లాడుతూ ఔత్సాహిక మహిళలకు 15 రోజుల్లో పరిశ్రమ నిర్వహణ, ఉత్పత్తుల మార్కెటింగ్ మెళకువలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్, అలీప్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఖాసీం మహమ్మద్, జిల్లా వయోజన విద్యాధికారి మురళి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కిరణ్, నర్సాపూర్, శివంపేట్ మండలాల ఏపీఎంలు గౌరీశంకర్, వెంకటేశ్వర్లు, డీఎంజీ దత్తాత్రి, సీసీలు భాగ్య, రవీందర్ పాల్గొన్నారు.

### విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి

అల్లాదుర్గం, జూన్ 6: విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏవో రాజేశ్ సూచించారు. శుక్రవారం బహిరన్‌దిబ్బ గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. విత్తన ప్యాకెట్లపై వివరాలు, తయారు తేదీ, గడువు తేదీ, లాట్ నెంబర్ చూసుకోవాలన్నారు. బిల్లులపై అన్ని వివరాలు రాయించుకుని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలన్నారు. లూజు విత్తనాలు, లేబుల్, రసీదు లేకుండా కొనకూడదన్నారు. లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు కొనాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ కార్యాలయంలో ఆరోగ్య శిబిరం

నర్సాపూర్, జూన్6: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. తడి, పొడి చెత్త వేరు చేయుట గురించి అవగాహన కల్పించారు. పట్టణంలో తాగు నీటి సరఫరా క్లోరినేషన్‌ను పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో వీధి కుక్కలకు ఆపరేషన్లు నిర్వహించారు. మేనేజర్ మధుసూదన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### సమావేశాలు ఘనంగా నిర్వహించుకోవాలి

మెదక్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పండుగలా జరుపుకోవాలని జిల్లా ఇన్‌చార్జిలు బొజ్జ సైదులు, విజయ్‌కుమార్ తెలిపారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్, ఎమ్ఎస్ఎఫ్, ఎంఎంఎస్, వీహెచ్‌పీఎస్, ఎంఎల్ఎఫ్, అనుబంధ సంఘాల విస్తృత స్థాయి సమావేశాన్ని మెదక్‌లోని టీఎన్జీవో భవనంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి, జిల్లా కార్య, నిర్వాక అధ్యక్షుడు బాలరాజ్, సీనియర్ నాయకులు కొమ్ము శేకులు, సామిల్, జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఉషన్నగళ్ల మురళి మాదిగ, మహిళా నాయకురాలు మాధవి, జిల్లా ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, ఘనపూర్ మండల అధ్యక్షుడు సంజీవులు, మెదక్ మండల అధ్యక్షుడు చెవిటి గట్టయ్య, పట్టణ నాయకులు కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

### ఆవంచలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్

నర్సాపూర్, జూన్6: మండలంలోని ఆవంచలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా వివిధ ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.చిన్నబాబు నాయక్, డా.జేసుదాసు వరి పంట రకాలు, వాటిలో వచ్చే పురుగులు, తెగుళ్ల గురించి వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చే వ్యవసాయ పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. ఏవో దీపిక మాట్లాడుతూ విత్తన కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం తునికి హెడ్ శాస్త్రవేత్త ఎస్.డి.నల్కర్ పాల్గొన్నారు.

### ఆర్టీసీ డిపోను పరిశీలించిన ఆర్ఎం

నర్సాపూర్,జూన్6: నర్సాపూర్‌లోని ఆర్టీసీ డిపోను రీజినల్ మేనేజర్ విజయ్ భాస్కర్ శుక్రవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం బస్టాండ్‌ను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు.

# సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- బడిబాటలో పిల్లలను చేర్చుకోవాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్

చేగుంట, జూన్6: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి పూర్వవైభవం తీసుకురావాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం చేగుంటలోని సుభాష్‌నగర్‌లో ఉన్న ఎంపీపీఎస్‌లో బడిబాట కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. బడీడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యత, ప్రయోజనాల గురించి, పాఠశాలలో కల్పించే మౌలికవసతులు, విద్యార్థులకు యూనిఫార్మ్స్, టెక్స్ట్ అండ్ నోట్‌బుక్స్ అందించుట, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రూపు దిద్దుకుంటూ సదుపాయాలు మెరుగుపరుస్తూ విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్యను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, ఎంఈవో నీరజ, ఎంపీడీవో చిన్నరెడ్డి, ఈవో నరేశ్, ఉపాధ్యాయుడు లక్ష్మణ్ ఉన్నారు.

### నిజాంపేటలో..

నిజాంపేట, జూన్6: నిజాంపేటలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు జ్ఞానమాల, అరుణ, ఉపాధ్యాయ సిబ్బంది పలు వీధుల వెంబడి ర్యాలీగా వెళ్తు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, పోషక విలువలు గల మధ్యాహ్న భోజనం, పది పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత, రెండు జతలు యూనిఫాంలు, పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ అందజేస్తున్నట్లు తెలిపారు.

### నర్సాపూర్‌లో..

నర్సాపూర్, జూన్6: మండలంలోని బ్రాహ్మణపల్లి జడ్పీహెచ్ఎస్‌లో జయశంకర్ బడిబాటలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

### రామాయంపేటలో..

రామాయంపేట, జూన్ 6: మండల వ్యాప్తంగా బడి బయట



చేగుంట: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో బడిబాటలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

ఉన్న విద్యార్థులను బడిలో చేర్చుకోవాలని ఎంఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని సుతారిపల్లి, కోనాపూర్, డి.ధర్మారం, దామరచెర్వు గ్రామాల్లో బడిబాటను ఎంఈవో ప్రారంభించారు. బడిబయట ఉన్న పిల్లలను కచ్చితంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడిలో చేర్చుకోవాలన్నారు.

### అల్లాదుర్గంలో..

అల్లాదుర్గం,జూన్ 6: సర్కారు బడుల్లో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచేందుకు బడిబాట చేపట్టినట్లు ఎంఈవో ధనుంజయ అన్నారు. మండలంలోని గొల్లకుంట తండాలో బడిబాటను ప్రారంభించారు. మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

### వెల్దుర్తిలో..

వెల్దుర్తి, జూన్6: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతుందని, పిల్లలను చేర్పించాలని వెల్దుర్తి జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సాంబయ్య సూచించారు. వెల్దుర్తి పంచాయతీ కార్యాలయంలో బడిబాటపై గ్రామసభ నిర్వహించారు. అర్హత కలిగిన, పోటీ పరీక్షల నుంచి ఎంపికైన ఉపాధ్యాయులు బోధన చేస్తారని, విద్యా అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు.

### చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్, జూన్6: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని చిలి



చిలిపిచెడ్:చిట్కుల్‌లో బడిబాటలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పిచెడ్, చిట్కుల్, గౌతాపూర్, చండూర్, ఫైజాబాద్ ఆయా పాఠశాల ప్రధానోపాధ్యయులు, ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులకు తెలిపారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను తల్లిదండ్రులకు వివరించారు.

### పాపన్నపేటలో..

పాపన్నపేట, జూన్ 6: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో ప్రతాప్‌రెడ్డి కోరారు. పాపన్నపేటలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లోని సౌకర్యాలు, నాణ్యమైన విద్య, గురించి అందరికీ తెలియజేసి విద్యార్థులను చేర్పించాలని సూచించారు. పాపన్నపేట ఉన్నత పాఠశాలకు చెందిన దృశ్య సంచిక, కరపత్రాలు, లఘు వీడియోలు ఆవిష్కరించారు.



రామాయంపేట: కోనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం

# రేషన్ బియ్యం పంపిణీలో అంకిత భావంతో పనిచేయాలి



చేగుంట: రేషన్ దుకాణంలో సన్న బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**- కలెక్టర్ రాహుల్ రాజ్**

చేగుంట, జూన్6: నిరుపేదలకు అందించే సన్నబియ్యం పంపిణీలో అధికారులు అంకిత భావంతో పనిచేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. చేగుంటలోని చౌక ధరల దుకాణాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మూడు నెలలకు సంబంధించిన సన్న బియ్యం జూన్‌లోనే సరఫరా చేసుకుందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందున అధికారులు పంపిణీని వేగవంతం చేయాలని సూచించారు. మండల స్టాక్ పాయింట్లను సందర్శించి రిజిస్టర్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

### భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు

భూసమస్యల పరిష్కారానికి విస్తృత సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన రైతు సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. చేగుంట మండలంలోని అనంతసాగర్‌లో కొనసాగుతున్న భూభారతి రెవెన్యూ సదస్సును కలెక్టర్ శుక్రవారం సందర్శించి, దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారం అవుతాయన్నారు. హెల్ప్ డెస్క్ ద్వారా దరఖాస్తుదారులకు సహకారాన్ని అందించాలని, రెండు బృందాలుగా రెవెన్యూ సిబ్బందిని నియమించి క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో చేగుంట తహసీల్దార్ శ్రీకాంత్,డిప్యూటి తహసీల్దార్ స్వప్న,ఆర్ఐలు జైభారత్ రెడ్డి,సంతోష్‌రావు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### త్యాగానికి ప్రతీక బక్రీద్

మెదక్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): త్యాగానికి ప్రతీకగా జరుపుకొనే బక్రీద్ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ ముస్లింలకు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. శనివారం బక్రీద్ సందర్భంగా దైవ భక్తి, త్యాగ నిరతికి పండుగ అద్దం పడుతుందన్నారు. ఉన్న దాంట్లోంచి ఇతరులకు పంచిపెట్టడానికి మించిన దాతృత్వం మరొకటి లేదని అభిప్రాయపడ్డారు.

## జాతీయ స్థాయిలో మిర్జాపల్లి విద్యార్థుల ప్రతిభ

చిన్నశంకరంపేట, జూన్6: మిర్జాపల్లి జడ్పీహెచ్ఎస్ 9వ తరగతి విద్యార్థులు రూపొందించిన విత్తన శుద్ధి యంత్ర పరికరం జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీలో టాప్ 100లో నిలిచిందని ఎంఈవో పుష్పవేణి శుక్రవారం తెలిపారు. స్కూల్ ఇన్నోవేషన్ మారదాస్ 2024-25లో భాగంగా జాతీయ స్థాయిలో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పోటీపడగా బ్లింకింగ్ స్టార్స్ టీం పేరుతో విద్యార్థులు రూపొందించిన వ్యవసాయం, కోళ్ల ఫాంలో వాడే విత్తన శుద్ధి యంత్రం అందరిని ఆకట్టుకున్నట్లు పేర్కొన్నారు. నెల రోజుల క్రితం విద్యార్థులు రూపొందించిన పరికరం పనితీరును వీడియో రూపంలో చిత్రీకరించి జాతీయ స్థాయి పోటీలకు పంపినట్లు ఆమె వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నివాస్‌రాయుడు. ప్రశాంత్, వినయ్‌కుమార్, గణితం ఉపాధ్యాయుడు రాజేశ్‌ను ఆమె అభినందించారు.



విత్తన శుద్ధియంత్రం

## రేషన్ షాపులకు అందని సన్న బియ్యం




బియ్యం కోసం చూస్తున్న లబ్ధిదారులు



బియ్యం రాక బంద్ ఉన్న రేషన్ షాపు

చిలిపిచెడ్, జూన్ 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ కార్డున్న కుటుంబాలకు మూడు నెలలకు సన్న బియ్యం అందించాలని ఈనెల ఒకటో తేదీన ప్రారంభించాయి. చిలిపిచెడ్ మండలంలో 14 రేషన్ షాపులు ఉన్నాయి. చిలిపిచెడ్, ఫైజాబాద్, బండపోతుగల్ గ్రామాల్లో నెలకు సరిపడే రేషన్ బియ్యం వచ్చింది. మిగితా గ్రామాలకు కిలో బియ్యం కూడా ఇప్పంటికీ రాలేదు. రేషన్ డీలర్ల మండల అధ్యక్షుడు అంతాగౌడ్ ఎన్నిసార్లు జిల్లా అధికారులు, మండల అధికారులకు చెప్పినా ఫలితం లేకుండా పోయింది. ఎప్పుడు వస్తే అప్పుడే బియ్యం ఇస్తామని అధికారులు చెబుతున్నారని ఆయన తెలిపారు. రేషన్ షాపుల చుట్టూ తిరుగుతున్న బియ్యం కోసం పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు రోజులు గడిచినా రేషన్ షాపులకు బియ్యం పంపిణీ చేయాలేదు. కనీసం నెల బియ్యమైనా పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

## 366 మందికి ఇండ్ల మంజూరు పత్రాలు అందజేత



లబ్ధిదారులకు ఇందిరమ్మ గృహ మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

రామాయంపేట, జూన్6: రామాయంపేటలోని ఓ ఫంక్షన్ హాల్లో ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు 366 మందికి మంజూరు పత్రాలను మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు శుక్రవారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 16 నెలల కాలంలోనే నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. రామాయంపేటకు రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలు మంజూరు చేయించినట్లు తెలిపారు. పట్టణంలో రూ.15కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. పెండింగ్‌లో భూమి సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ మాణిక్యం, మున్సిపల్ కమిషనర్ దేవేందర్, ఎంపీడీవో షాజులుద్దీన్, సుప్రభాతరావు, సరాఫ్ యాదగిరి, రమేశ్ రెడ్డి, దేమె యాదగిరి సుందర్‌సింగ్, అల్లాడి వెంకటి ఉన్నారు.


### నిజాంపేటలో..

నిజాంపేట,జూన్6: నిజాంపేటలోని సబ్ మార్కెట్ యార్డులో మండలానికి చెందిన 293 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ పత్రాలు, 9 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎమ్మెల్యే రోహిత్‌రావు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజిరెడ్డి, ఎంపీవో ప్రవీణ్, మాజీ ఎంపీపీ సిద్ధిరాములు, మాజీ సర్పంచ్ అమరసేనారెడ్డి,మాజీ ఉపసర్పంచ్ కొమ్మాట బాబు తదితరులు ఉన్నారు.

### ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

పాపన్నపేట, జూన్6: మండలంలోని పాత లింగాయిపల్లిలో నిర్వహించిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠాపనోత్సవాల్లో ఎమ్మెల్యే రోహిత్ రావు పాల్గొన్నారు. నాయకులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీకాంత్, నరేందర్‌గౌడ్, శ్రీనివాస్, నారాయణ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



చేగుంట,జూన్6: దుబ్బాకలోని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా దుబ్బాక క్యాంపు కార్యాలయంలో చేగుంట మండల బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు రంగయ్యాగారి రాజిరెడ్డి, చేగుంట సొసైటీ డైరెక్టర్ రఘురాములు, పట్టణశాఖ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి, పోలంపల్లి అధ్యక్షుడు సిద్దిరాములు, స్వామి తదితరులున్నారు.


# భూ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలి

**- అదనపు కలెక్టర్ నగేశ్**

వెల్దుర్తి, జూన్6: రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు చేసుకోవాలని అదనపు కలెక్టర్ నగేశ్ సూచించారు. శుక్రవారం వెల్దుర్తి మండలంలోని అందుగులపల్లిలో తహసీల్దార్ బాలలక్ష్మి ఆధ్వర్యంలో రైతుసదస్సు నిర్వహించారు. రైతులు అందిస్తున్న దరఖాస్తులు పరిశీలించి, సదస్సు నిర్వహణ తీరు, వాటి పరిష్కారంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడిన అదనపు కలెక్టర్ సమస్యలున్న వారు దరఖాస్తు చేసుకుంటే అధికారులు అప్పటికప్పుడే పరిష్కరిస్తారన్నారు. ఉప్పులింగాపూర్‌లో డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరీ ఆధ్వర్యంలో మాసాయిపేట మండలంలో తహసీల్దార్ జ్ఞానజ్యోతి ఆధ్వర్యంలో చెట్లతిమ్మాయిపల్లి గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు.

**సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు**

రామాయంపేట, జూన్6: సమస్యల పరిష్కారం కోసమే



వెల్దుర్తి: అందుగులపల్లి రైతు సదస్సులో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేశ్

ప్రభుత్వం భూ భారతి సదస్సులను ప్రవేశపెట్టిందని తహసీల్దార్ రజినీకుమారి పేర్కొన్నారు. మండలంలోని సుతారిపల్లి, శివ్వాయపల్లి గ్రామాల్లో రెవెన్యు సదస్సులు ప్రారంభించి, రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను రెవెన్యు సదస్సులో పరిష్కరించుకోవాలన్నారు.

**చల్మెడలో భూభారతి**

నిజాంపేట, జూన్6: భూ సమస్యల పరిష్కరానికి ప్రభుత్వం చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులు నిజాంపేట మండలంలో కొనసాగుతున్నాయి. చల్మెడ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన భూభారతి రెవెన్యూ సదస్సులో రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలను అధికారులకు తెలుపుతూ అందుకు సంబంధించిన వివరాలను దరఖాస్తుల రూపంలో అందజేశారు.

**పాపన్నపేటలో..**

పాపన్నపేట, జూన్6: రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు సమర్పించాలని ఆర్డీవో రమాదేవి అన్నారు. మండలంలోని నామాపూర్‌లో రెవెన్యూ సదస్సును పరిశీలించారు. భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### బెస్ట్ అవైలెబుల్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, జూన్6: గిరిజన విద్యార్థులకు బెస్ట్ అవైలెబుల్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని గిరిజనాభివృద్ధి జిల్లా అధికారిణి నీలిమ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 49 సీట్లలో ఖాళీలు 3వ తరగతిలో 25 సీట్లు, 5లో 12 సీట్లు, 8లో 12 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈనెల 17వ తేదీలోగా దరఖాస్తులను కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. బాలికలకు 33 శాతం సీట్లు రిజర్వేషన్ ప్రకారం కేటాయిస్తారన్నారు. 20న ఉదయం కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిన ఎంపిక చేస్తారన్నారు.

### కేజీవీబీలో పీజీసీఈఆర్టీలకు దరఖాస్తుల ఆహ్వానం

చిలిపిచెడ్, జూన్6: చిట్కుల్ కేజీవీబీలో పీజీసీఈఆర్టీలుగా ఇంటర్మీడియట్ బైపీసీ బోధించేందుకు పీజీలో 60శాతం మార్కులు సాధించిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారి అంజలి ప్రకటనలో కోరారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో బైపీసీ గ్రూపు ప్రారంభించామన్నారు. తెలుగు, ఆంగ్లం, వృక్ష శాస్త్రం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో బోధించే వారు కావాలన్నారు.

### బోరు మోటర్ల కేబుల్ చోరీ

వెల్దుర్తి, జూన్ 6: వెల్దుర్తి శివారు కుడిచెరువు సమీపంలోని వ్యవసాయ పొలాల బోరుమోటర్లలో కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. గంగమ్మ ఆలయం వెనక భాగంలోని పొలాల వద్ద గురువారం రాత్రి తొమ్మిది బోరుమోటర్ల విద్యుత్ కేబుళ్లు చోరీకి గురయ్యాయి. వెల్దుర్తితో పాటు చుట్టు పక్కల రైతులు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళల్లో వ్యవసాయ పొలాల వద్ద అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

### విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు చేయరాదు: ఎస్పీ

మెదక్ అర్బన్,జూన్6: జిల్లా పరిధిలో సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు దుష్ప్రచారం, ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా పోస్టులు పెట్టేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు హెచ్చరించారు. రాజకీయంగా, కుల, మత, ప్రాంతీయంగా ప్రజల భద్రత, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిగా ఉన్న వాటిని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

### ఎస్ఐని సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు



ఎస్ఐకి బీఆర్ఎస్ నాయకుల సన్మానం

అల్లాదుర్గం, జూన్6: నూతనంగా విధుల్లో చేరిన ఎస్ఐ శంకర్‌ను శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఎస్ఐని కలిసిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లెగడ్డ నర్సింహులు, నాయకులు పవన్ కుమార్, శివరాం రాథోడ్, కృష్ణాగౌడ్, బేతయ్య తదితరులు ఉన్నారు.

### పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

చిలిపిచెడ్,జూన్ 6ః మండలంలోని గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌చార్జి ఎంపీవో తిరుపతి సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామల కార్యదర్శులతో సమావేశం ఏర్పాటుచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో, పంచాయతీలో పిచ్చిమొక్కలు, దోమల బెడద ఉండకుండా శుభ్రంగా ఉంచాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం, మరుగు నీటి నిల్వలు లేకుండా ప్లాస్టిక్ వ్యర్థాలు డంప్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

### పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

వెల్దుర్తి, జూన్6: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స కోసం గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తిలోని కోటకింది వాడకు చెందిన జువ్వ మధు (62) బీపీ, షుగర్, అధిక బరువు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై గురువారం రాత్రి విషం తాగి, వాంతులు చేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు నగరంలోని గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### మున్సిపల్ కమిషనర్‌నంటూ వ్యాపారస్తులకు బురిడీ

తూప్రాన్, జూన్6: ట్రూ కాలర్‌లో 8247649631 మొబైల్ నెంబర్‌పై మున్సిపల్ కమిషనర్ అంటూ ఫీడ్ చేసుకుని రెండు రోజులుగా తూప్రాన్‌కు చెందిన పలువురు వ్యాపారులకు ట్రేడ్ లైసెన్సుల రెన్యువల్ పేరిట ఓ అపరిచిత వ్యక్తి కాల్ చేస్తూ ఫోన్‌పే స్కానర్ పంపిస్తూ డబ్బులు పంపించమంటూ మోసం చేస్తున్నాడని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.